# సందల్‌ఖోడ్



## అక్కంపేట ఇబ్రహీం

తక్కువ రాసినా ఎంచి చూసేలా రాసిన రచయిత. స్వస్థలం కడప జిల్లా పోరుమామిళ్ల. 1975 జన్మ సంవత్సరం. బిఎస్సీ బి.ఇడి. చదివారు.1997 నుంచి రాస్తున్నారు. ఇప్పటికి ఆరేడు కథలు రాశారు. 'జీవ సమాధి', 'కాలానికి ఎదురీదుతున్నవాడు' కథలు పేరు తెచ్చాయి. సమకాలీన ఘటనలకు స్పందిస్తూ రాయాలనేది వీరి కోరిక. 'రోజురోజుకు మైనారిటీల పట్ల కుట్రలు పెరుగుతున్నాయా అనే సందేహం కలుగుతోంది... అలాంటి వాతావరణం ముస్లింలలో భయాందోళనలు నింపుతోంది' అంటారు. వృత్తిరీత్యా అధ్యాపకులు. నివాసం కడప జిల్లా నరసాపురం.

'రే ఇబ్రూ... సందల్ ఖోడ్ (గంధపు చెక్క) యాడన్నా చూసినావారా?' ఇంట్లోంచి అమ్మ కేకేసింది.

'లేదు మా' వీధిలోంచి నేను కూడా కేకేసిన– బండిగానుకు తొడగటానికి పిడకల్లో కాల్చిన కమ్మీలా ఎఱ్ఱగా పడమటి కొండ మీద ఆనబోతున్న పొద్దు అందం చూడ్డంలో మునిగి.

'బా...బా...రావంత వెతికి పెడ్డువు రా నాయనా' అమ్మ వేడికోలు గొంతు మృదువుగా రెక్క పట్టుకుని లాగింది.

'వస్తుండాలేమా' బదులిస్తూనే ఇంట్లోకి పరిగెత్తా.

గడపలో అడుగుపెట్టానే కమ్మగా కమ్ముకున్నది మసాలాలో పొర్లాడి, షేర్వాలో ఈదులాడి మెత్తమెత్తగా ఉడికిన ముక్కల ఘుమఘుమ. అది ముక్కుల్లోకి జొరబడి గుండెల్నిండా పాకి కడుపులోకి సందు జేసుకుని యాడో కరకరను పుట్టిస్తాంటే దాని దెబ్బకు తట్టుకోలేక అమ్మవైపు జూసిన.

అమ్మ నన్ను చూళ్లేదు. గాబరా గాబరాగా వెదుక్కుంటోంది. అమ్మకు ప్రతిదానికీ గాబరానే. అందునా ఈరోజు పండగ.

వెనక రూములో పొయ్యి దిగిన కుండల్లోంచి తోసుకొస్తున్న రకరకాల వాసనలు పేగుల్ని బోరింగుబండి పైపులా కిందకి మీదికి కలదిప్పుతాంటే ఆత్రంగా నేను కూడా సందల్‌ఖోడ్ వెతికే పనిలో పడినా.

ముందు ఖురాన్ పెట్టె ఉండే గూట్లో చూసిన. పెట్టె తెరవగానే ఊదుబత్తీల వాసన గుప్పున మొఖమ్మీదికొచ్చింది.

'ఆడ చూసినా నాయనా' ఇంకో గూట్లో వెతుకుతూ అంది అమ్మ.

'ఈడ లేదంటే... ఇంగేడ ఉంటదిబ్బా' ఆలోచనలో పడిన.

అదసలే చిన్నముక్క. నేను పుట్టకముందు నుంచి ఇంట్లో ఉన్నెట్టుంది. మొదట్లో ఎంతున్నదో.. ఎట్టున్నదో. పండక్కి పండక్కి అరిగిపోయి ఇప్పుడు చిన్న త్రికోణాకారపు చెక్కగా చిక్కిపోయి వుంది. ఎక్కడ పడిపోయిందో అది. దొరక్కపోతే ఇబ్బందే. అందుకే అమ్మకు ఆదుర్దా.

ఈ రోజు పెద్దల పండగ. పొద్దుగూకీ గూకకముందే చదివింపులు చేసెయ్యాల. పైలోకంలో ఉండే పెద్దోళ్లు మావాళ్లు మాకోసం ఏం వండి పెట్టారో అని తొక్కులాడ్తా ఉంటారంట.

వాళ్లకిష్టమైనవన్నీ ఇయాల వండిపెట్టాం. వాళ్లలో ఎవరికన్నా ఆకు వక్క బీడీలాంటి అలవాట్లుంటే అవి కూడా తెచ్చిపెట్టాల. ఇవే కాక పండ్లు, పూలు ఇంట్లో వాడకుండా ఏమన్నా కొత్తగుడ్డలుంటే అవీ... అన్నీ పెట్టి వాళ్ల పేరిట చదివింపులు చెయ్యాల. అప్పుడు పెద్దలంతా భూమ్మీదికి దిగొచ్చి ఈ చదివింపులన్నీ అందుకుంటారని నమ్మకం. నిజంగా వాళ్లు అందుకుని అనుభవించకపోయినా వాళ్లకు చదివించినవి పేదలకు దానం చేస్తే ఆ పుణ్యం వాళ్లకు దక్కుతుందని విశ్వాసం.

ఎవరింట్లో చదివింపులు ముందుగా పూర్తవుతాయో ఎవరి పెద్దలు ముందుగా భూమ్మీదికి దిగొస్తారో ఆ ఇంట్లోళ్లకు ఇంకా పుణ్యమట! అందుకే చదివింపులు త్వరగా చెయ్యాలని ప్రతి అమ్మకు తొందర. మాయమ్మగ్గూడా తొందర. ఆమెకు చదివింపుల తొందరైతే నాకు అమ్మ చేసినవన్నీ గబగబా లాగియ్యాలనే తొందర.

ఈ తొందరలన్నీ సందల్‌ఖోడ్‌తో ముడిపడి వున్నై. అది కనబడితేగానీ ఈ ముళ్లన్నీ విడిపోవు.

రేడియో గూటిలో వెతికినా. అద్దంగూటిలో వెతికినా. ఈడనన్నా కనబడక పోతుందా అని పుస్తకాల గూటిని కదిలిస్తా వుండా.

ఇంకాసేపట్లో చోటు చేసుకోబోయే చదివింపుల దృశ్యం ఇప్పటికిప్పుడే నా కళ్లలో మెదలసాగింది.

పడమటిదిక్కు గోడకానుకుని చాపంతనేలను మల్లొకసారి శుభ్రంగా

తుడుచుకొచ్చి జానిమాజ్ పరిచింది అమ్మ. వండిన వంటకాలన్నీ గిన్నెల్లో తీసుకొచ్చి గోడవారగా పెట్టింది. అన్నం మాత్రం దబరా దబరా తెచ్చిపెట్టింది. ఊదుకడ్డీలు వెలిగించి బియ్యం గ్లాసులో గుచ్చి పెట్టింది. అరటిపండ్లు, పూలు, ఆకువక్కలు, కొత్తగుడ్డలు...అన్నీ సర్దింది. సాంబ్రాణి పొగ వెయ్యడం కోసం మూకుట్లో నిప్పు కణికెలు తెచ్చిపెట్టింది. గంధం తీసుకొచ్చి అన్ని వస్తువుల మీద చిలకరించింది. నాయన జానిమాజ్ మీద కూర్చొని చదివింపులు చదువుతుంటే తల నిండా కొంగు కప్పుకొని పక్కనే ఒదిగి కూచున్నది. ఫాతెహా చివర్లో నాయన పెద్దల పేర్లు ఒక్కొక్కటే పలుకుతుంటే వాళ్లకు చేరేలా అమ్మ సాంబ్రాణి పొగవేసింది. చదివింపులయ్యాక గోడ మీదున్న దర్గాల ఫోటోల మీద చూపుడువేలితో గంధాన్ని చిలకరించింది. అరచేతులకు రాసుకుని వాకిలి రెక్కల మీద హస్తం ముద్రలు వేసింది. లోపలా బైటా ఇంటిని సుగంధభరితం చేసి మాయబ్బ జేజ కాణ్ణుంచి వంశంలోని పెద్దలందర్నీ మంచి గంధంలాంటి మనసుతో మౌనంగానే పిలిచింది.

ఇంగ అందరం కాసేపట్టా బైట కూచ్చొని వాళ్లొచ్చిపోవడానికి పది నిమిషాలు టైమిచ్చినామంటే ఆ తర్వాత మనదే రాజ్యం.

ఇంతలో 'ఈడేందో సంచుల సాటు ఉన్నెట్టుంది. సూజ్జం రా నాయనా' అంది అమ్మ.

ఊహల్లో ఆరగించబోతున్న పండగ విందుకు అమ్మమాటలు అడ్డుపడినై.

రాగుల సంచులు... ఒక దానిమీదొకటి... మూడుండై.

అమ్మొక తట్టు నేనొక తట్టు పట్టి సంచుల్ని కిందకు దింపినం. అడుగు సంచికీ గోడకూ మధ్య విరిగిపోయిన పీట తాలూకు అడుగు చెక్క!

సందల్‌ఖోడ్ కాదు.

క్షణం కింద తళుక్కుమన్న అమ్మమొఖం అంతలోనే కళ తప్పింది. చెరోదిక్కు మళ్లీ వెతుకులాటలో పడ్డాం.

దండెం మీద మాసిన గుడ్డల్ని పక్కకు జరిపి వెనక ఉండే గూళ్లలో వెతుకుతుండా. తెరిచి ఉన్న ఖురాన్ పెట్టెలోంచి బైటికొస్తున్న ఊదుబత్తుల వాసన్ను పక్కకు తోస్తూ ఏదో ఘాటువాసన.

'అరె అల్లా...' గుండె అదిరిపడేలా ఉలిక్కిపడి వెనకరూములోకి పరుగెత్తింది అమ్మ.

పొయ్యి మీద ఏదో పెట్టి వచ్చినట్లుంది. ఈ వెదుకులాటలో మర్చిపోయింది. మాడిపోయిన వాసన ఇల్లంతా పాకిపోయింది.

ఆకులొక్కలు తేను అంగడికి పోయిన నాయన తిరిగొస్తుంటాడేమో. వస్తే అమ్మను అరుస్తాడేమో. నేను కూడా భయపడ్తా పోయి అమ్మ వెనకాలే నిలబడినా.

పాపం అమ్మ!

రోజూ ఉండే పనులతోనే కిందా మీదా పడ్తాంటే ఆమె పానం మీదికి ఈ పండగలొకటి.

నిన్న మొదలుపెట్టింది పండగ తయారీ. పొదుగాలే రాత్రికి వండి పెట్టి చాటలో అల్లం, తెల్లవాయలు వేసుకుని కూర్చొంది. తిరగబాత అన్నంలోకి బండెడు తెల్లవాయలు కావాల. అన్ని వలిచేటప్పటికి గోళ్ల సందున పొట్టు దూరి గోళ్లూ వేళ్లూ మంట పుట్టి పోతై. అల్లంకొమ్మును మంచం నులకకేసి రుద్దితే అల్లంతోపాటు వేళ్ళ మీది తోలు కూడా ఊడొస్తది. పండగపూట ఇంట్లోవాళ్ల కోసమే కాక అడుక్కునే వాళ్ల కోసం కూడా దండిగా వండుతుంది అమ్మ. అందుకోసం పొద్దుపోయేదాక తెల్లవాయలు వలుస్తానే ఉన్నది.

పొద్దున లేస్తానే బర్రెగొడ్లకాడ పేడ ఎత్తేసి ఇంట్లో కసువు దోసి, బోకులు కడిగి పెట్టుకుని గడ్డికి పోయింది. చిన్న కొండంత గడ్డిగంపను ఎత్తుకుని తిరిగొచ్చినాకనె నోట్లో బొగ్గేసి పళ్లు తోమింది. సద్దినీళ్లు రొవన్ని కడుపులో పోసుకున్నదో లేదో మళ్లా పనిలోబడ్డది.

ఇల్లంతా బూజు తుడిచింది. శుభ్రంగా బండలు కడిగింది. ఎర్రమట్టి కలిపి పొయ్యిగడ్డని అలికింది.

మధ్యానానికి సంగటికి ఎసరుపెట్టి ఈ ఒక్కపూటకు కూరాకు ఏం చేయాల్నా అని కాసేపు తనకలాడింది.

జాలీ అల్మారాలో నాయన తెచ్చిపెట్టిపోయిన మాంసాన్ని ముక్కలు కోసి పసుపూ ఉప్పూ కలిపి పెట్టింది. రాత్రికీ పండగ వంటకూ కావాల్సిన కూరగాయల్ని తరిగి, సంగటి తిన్నాక పంచలో మంచం వాల్చుకుని నాయన హాయిగా నిద్రపోతే అమ్మ వంటల తయారీలో మునిగిపోయింది.

తలకు స్నానం చేసి ఒంటిమీది తడి తుడుచుకోకుండానే పొయ్యిమీదికి దబర ఎక్కించింది. నెత్తిలోని చెమ్మ వెంట్రుకలంబడి చుక్కలు చుక్కలుగా కారిపోతున్నా

ఆరబెట్టుకునే తీరికలేక పాత లంగాలో జుట్టును మెలేసి కొప్పుగా చుట్టింది.

తిరగబాత అన్నమంటే పొయ్యి మీద ఎసురు పడేసి ఇంగొక పని చూసుకోవడం గాదు. తిరగబాతకు సరిపోయేంత నూనె, నెయ్యి వేసి కాగనియ్యాల. సన్నగా తరిగిన ఉల్లిపాయల్ని దాంట్లో వేసి బంగారు రంగు వచ్చేదాక వేగనియ్యాల. తరిగిన టమాటాల్ని పచ్చి మిరపకాయల్ని కొత్తిమీరను కలిపి వేయించాల. ఒకటొకటిగా ఇవన్నీ వేగేదాక పొయ్యి సెగన్నే నిలబడుకుని కబ్‌గీర్ (బొక్కల గరిటె)తో కలదిప్పుతా అడుగంటకుండా చూసుకోవాల. అన్నీ పాకంగా వేగినాక బియ్యానికి తగినట్టుగా ఎక్కువ తక్కువ కాకుండా కరెట్టుగా ఎసురు పోసుకోవాల. ఎసురు కాగేలోగా బియ్యాన్ని కడిగి రెడీగా పెట్టుకోవాల. పొంగొస్తానే ఎసుట్లో బియ్యంపోసి మసాలా సమంగా కలిసిపోయేలా కలయదిప్పాల. పొయ్యిలో మంటను కనిపెడ్తూ పలుకు లేకుండా, మెత్తగా కాకుండా పొడిపొడిగా అన్నం ఉడికేదాక కాపుగాయాల...

ఇంత పని.

తిరగబాతన్నం, సియ్యలకూర, భాజీ, దాల్చా... ఇయన్నీ ఉడికి దిగే యాలకు పొయ్యిసెగకు అమ్మ ఒంట్లోని సియ్యలు గూడా ఉడికిపోతై. ఆఖర్న సేమ్యాల్ని పొయ్యి మీద పెట్టి సందల్‌ఖోడ్ వెతుక్కునే పనిలో పడి ఏమరుపాటులో పడేసరికి ఏటి జాలులో ఉలిసెల్లా పాయసంలో అటూ ఇటూ కదలాడాల్సిన సేమియాలు ఉడికి ఉడికి చచ్చిన చేపలమాదిరి పొట్టలుబ్బి గడ్డకట్టి పొయినై.

పొయ్యిల మంటను బైటికి లాగేసి హస్తంతో కిందికి మీదికి తిరగేస్తా దిగులుపడ్తా కూర్చున్నది అమ్మ.

కింద రెండు వరుసలు అడుగంటిపొయినై. వాటిపైన రెండు వేళ్ళెత్తున నారింజ రంగులోకి మారినై. ఆ పైన ఉండేటియి తెల్లగానే ఉండై.

తినడానికి పనికొస్తాయోరావో కనుక్కుందామని అమ్మ ముఖంలోకి తొంగి చూసినా. సేమియాల్లాగే రకరకాల రంగులు అమ్మ ముఖంలో.

కాసేపు అలాగే గొంతుక్కూర్చొని బాధనో, భయాన్నో కడుపులోనే అదుముకుని లేచి నిలబడ్డది అమ్మ.

ఇంక సందల్‌ఖోడ్‌ను వెతకడానికి ధైర్యం సాలక...

'గౌసియా ఖాలానడిగి వాళ్లది త్యాపో నాయనా' అంది.

అనడమేమో అన్నదిగానీ ఆమె ఇచ్చేదీ లేందీ నాకంటే అమ్మకే బాగా తెలుసు.

అయినా ఇప్పుడు ఎనకాముందాడ్నే సమయం గాదు కాబట్టి 'పొయ్యొస్తలేమా' అని బైటికురికిన.

కాలిన కమ్మీ సూర్యుడు కొండల్లోకి దిగబడి ఆరిపోయిండు.

కమ్మీ ఆరినప్పుడు వచ్చే పొగలాంటి చీకటి పంజా వెలుగును సిన్నంగ మింగు తాంది.

గౌసియా ఖాలా మగ్‌రిబ్ (సూర్యాస్తమయ కాలంలో చదివే) నమాజు చదువుకుంటోంది. పూర్తయ్యేదాక నిలబడక తప్పదు. వాకిలి మొత్తనానుకుని నిరీక్షణలో పడినా. చదివింపులు చదవడానికే గౌసియా ఖాలా మొగుణ్ని పిలుచుకుని పోను ఒంటెద్దుబండి కీక్కీ వచ్చుండాడు. ఇంటిముందు మంచంలో ఎల్లకిలా పండుకొని, అరమోడ్పు కన్నులతో ఆకాశంలోకి జూస్తా వానికి తత్వబోధ చేస్తుండాడా యన. కాల్లకట్ట కాడ కూచ్చొని నేలచూపులు చూస్తా అర్థమయీ కానట్టు ఊ కొడ్తాండాడు వాడు.

'కాయాకష్టంలో దినాం నలిగేటోల్లకేనోయ్ పండగలు. ఆ ఒక్క పూటన్నా వాళ్లు సుఖంగా, సంతోషంగా ఉండాలని...'

తత్వంలోని ముక్కొకటి నా సెవిలోకి దూరింది. కాసేపైనాక మెదడులోకి కూడా దూరింది. దాన్ని అమ్మ జీవితంతో ముడిపెట్టి చూసేసరికి కడుపులో భగ్గున మండింది.

కష్టంలో నలిగేటోల్లకే పండగైతే అమ్మ ఇయాల సుఖంగా ఉండాలి గదా? నాయనో, ఇంగొకరో వండి పెడ్తే తిని హాయిగా గడపాల కదా? తత్వం అమ్మకోసం కాదేమో. అది రాసి పెట్టిన కష్టజీవుల లిస్టులో అమ్మపేరు లేదేమో.

నిద్రమంచం దిగుతూనే కష్టాన్ని కౌగిలించుకుంటుంది అమ్మ. నాయన మలారం భుజానికి తగిలిచ్చుకుని పల్లెకు పోతే కూలోళ్లను పిలుచుకుని చేనుకి పోతుంది. పల్లె నుంచి తిరిగొచ్చినాయన సేని కాడికొచ్చేదాక అంటే పదిగంటల పొద్దుదాక కూలోల్లతో పాటు మునుంబట్టి పని చేస్తుంది. నాయనొస్తానే ఆగమేఘాల మీద ఇంటికొచ్చి సంగటి, కూరాకు చేసుకుని ఇంత పెద్ద గంపెత్తుకుని మళ్లీ చేను దోవ పడ్తుంది. కూలోల్లకు తీస్కొనిపోయిన వక్కో, చెక్కో పొరపాట్న తక్కువైతే ఛీ..ఛా... అని నాయన విదిలిస్తే మౌనంగా ఓర్చుకుంటుంది. కూలోల్లు ఇంటిదోవ పట్టే దాకా వాళ్లతో వెళ్లిపోయాక మునాల్లో కుప్పలు పడ్డ గోల్లగుండిని ఎత్తేయడమో, మధ్యలో

వదిలిపోయిన మునాల్ని గట్టుకి ఎక్కియ్యడమో చేస్తుంది. పొద్దుగూకే వేళకు మెడ కుంగిపోయేంత గడ్డి గంపనో, పండుగాయల మూటనో ఎత్తుకుని తిరుగుముఖం పడ్తుంది. ఇంటికొచ్చి బర్రెగొడ్లకు మేతా, నీళ్లు విచారించి వంటపనిలో పడ్తుంది. నాలుగు మెతుకులు ఎప్పుడు నోట్లో వేసుకుంటుందో, ఎప్పుడు నడుం వాల్చుతదో, తెల్లారి సూసేటప్పటికి బర్రెగొడ్లకాడ పేడ ఎత్తేస్తా కనిపిస్తది.

విత్తనం కసాలప్పుడు, మిరపగాయ కోతలప్పుడు చూడాలి అమ్మ అగసాట్లు... కూలోల్లను బంగపోవడాలు... కొండ్లకొచ్చినోల్లకు కమ్మగా వండుకొని పోవడాలు...

ఎండకు ఎండి అమ్మ ఒంట్లో చెమట వుబకందే పొలం పండదు. పొయ్యిసెగకు మండి అమ్మ కంట్లో చెమ్మ ఊరందే మాకు కడుపు నిండదు.

కష్టం చేసిచేసి అమ్మ చేతులు కాయలు గాసినై. గోళ్లు అరిగిపోయినై. తిరిగి తిరిగి పాదాలు పగుళ్ళు తేలినై. ముల్లులు దిగబడి బెజ్జాలు పడిపోయినై. బరువులు మోసి మోసి వెంట్రుకలు తెగిపోయి తలకట్టు చెదిరిపోయింది. చెంపలు కరిగిపోయి, చెక్కిళ్ళు వాడిపోయి నిండు చందమామలాంటి ముఖం రోజురోజుకు సొట్టబో తాంది. లేత కరివేప రెమ్మలా నవనవలాడ్తుండిన అమ్మ కాయకష్టపు తిరగబాతలో మలమల మాడిపోతాంది.

ఉద్రేకపు వరద గుండెల్లో పొంగిపొర్లుతాంది.

గౌసియా ఖాలా నమాజ్ చేసుకుని ఎప్పుడు లేసొచ్చిందో...

'క్యారే' అని అడుగుతాంది.

'సందల్‌ఖోడ్ కావాల' కల్లోంచి మాట్లాడినట్లు జవాబిచ్చిన.

'మా ఇంట్లో యాడ్ది నాయనా. నేను గూడా బీజాన్ వాళ్లింట్లో తెచ్చుకుని అప్పుడే ఇచ్చొచ్చినా' అంది.

'ఛ... ఈమె గుణం తెలిసి కూడా ఇంతసేపు నిలబడ్డం నాదే బుద్ధి తక్కువ' అనుకుంటా ఇంటికొచ్చిన. అమ్మకు సంగతి చెప్తుండగనే నాయన వచ్చిండు. గడప తొక్కిండో లేడో ముక్కులెగబీల్చి నొసలు ముడేసిండు.

వంటకాల ఘుమఘుమల్లో పండగవాసన కొట్టాల్సిన ఇంట్లో కనిపించని శనిలా కాటువాసన కమ్ముకోనుంది.

'ఏదో మాడగొట్టినావే?' పసిగట్టేసిండు.

'ఆ...సేమియాలు రొవంత మాడినైలే' భయపడ్తానే జవాబిచ్చింది అమ్మ.

'నువ్వేం గొడ్లు కాయను పోయి ఉన్నెవా?' ఉరిమిండు.

'సందల్ ఖోడ్ కనబడకుంటే వెతుక్కుంటూ ఉన్న. పెద్దగా మాడలేదులే...' ముఖం చాటు చేసుకుని పత్తిలోంచి విత్తనాలు తీసిపారేస్తా సంజాయిషీ చెప్పింది అమ్మ.

నాయన సల్లబడినట్టు లేదు.

'మాడిన సేమియాలు మా పెద్దోల్లకు సదివియ్యాల్నా' అని లోలోపల రాజుకుంటానే ఉన్నాడు. దూది ఒత్తులు చేసి ప్రమిదలో పెట్టి ఆముదం పోసి మంచినూనె దీపం తయారు చేసింది అమ్మ.

ఈపాటికి నాయన సల్లబడుంటాడులే అనుకుని... 'పిల్లొని చేతికి రెండు రూపాయలీ. అంగడికి పోయి గంధం డబ్బీ తీసుకొస్తాడు' అంది.

నాయనకు మంట నెత్తికెక్కింది.

'సేమ్యాలంటే అగ్గి పాల్జేసినవ్. గంధం కూడా లేకుండా చదివింపులు చేసి చస్తవా? ఆ డబ్బీ గంధం మట్టిగబ్బు తెచ్చి నీ మొఖాన సల్లుకో పో...' రంకెలేసాడు.

అమ్మ కిమ్మనలేదు. నాయన కోపం అణుచుకోలేదు.

'నీకు సంసారి గుణం కాస్తగూడలేదే గబ్బుదానా...' చెయ్యి విసురుగా పైకెత్తాడు.

కొయ్యబారి పోయాన్నేను. భయంతో కళ్లు మూసుకున్నాను.

'ఫట్...' మని చంప పగిలిన చప్పుడుకు అదిరిపడి కళ్లు తెరిచాను.

అమ్మ... పులిపంజాకు చిక్కిన లేడిపిల్లలా అమ్మ...

అదురుతున్న ముక్కుపుటాలు, వణుకుతున్న పెదవులు, కల్లోలమై కడలిగా మారుతున్న కళ్లు...

నాయన చెయ్యి మళ్లీ పైకిలేస్తోంది.

'కొట్టగాకు బా. సందల్‌ఖోడ్ కనిపిచ్చిందిలే' అరిచాను.

'యాడరా...?' ఎత్తిన చెయ్యి దించకుండానే నాన్న చూపు నావైపు తీక్షణంగా తిరిగింది.

నేను చూపించలేదు.

పండగపూట మాత్రమే అరిగి చందనాన్నిచ్చే సందల్‌ఖోడ్ నాకు కనబడ్డం

లేదు. పూట పూటకు అరిగిపోయి మా గబ్బు బతుకుల్లో గంధాన్ని నింపే నిలువెత్తు సందల్‌ఖోడ్ నాకు కనిపిస్తా వుంది.

ఇంకో దెబ్బ పడకుండా పోయి అమాంతంగా దాన్ని చుట్టేసుకున్నా.